సహకార సంఘాల బలోపేతానికి చర్యలు

ఎమ్మెల్యే కాలె యాదయ్య

నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోడౌన్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యాదయ్య

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 8 : ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల బలోపేతానికి చర్యలు తీసుకుంటున్నట్లు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. శనివారం చేవెళ్ల నియోజకవర్గ పరిధి శంకర్‌పల్లి మండలం జన్వాడ గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోడౌన్, మీటింగ్ హాల్, మహాలింగాపురం(దోబీపేట్) గ్రామంలో రూ.78 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోడౌన్, శంకర్‌పల్లి పట్టణంలో నూతనంగా నిర్మించిన నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోడౌన్, స్ట్రాంగ్ రూమ్, మీటింగ్ హాల్‌ను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ సత్యయ్య, డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులున్నారు.

చేవెళ్ల మండల పరిధి పామెన గ్రామంలో దుర్గమ్మ, మైసమ్మ అమ్మవారి బోనాలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే యాదయ్య హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నేతలున్నారు.

శుభకార్యాలకు అద్దెకు బస్సులు

షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 8 : ప్రజలకు ఆర్టీసీ ద్వారా మరింత మెరుగైన సేవలు అందించడం కోసం శుభకార్యాలకు షాద్‌నగర్ టీజీఎస్ ఆర్టీసీ బస్టాండ్ నుంచి బస్సులు అద్దెకు ఇవ్వడం జరుగుతుందని ఆర్టీసీ డీఎం ఉష శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వివాహ శుభకార్యాలకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులను అద్దెకు ఇవ్వడం జరుగుతుందని, బస్సు కిలోమీటర్ చార్జిలో రూ.7 తగ్గింపు కల్పించినట్లు తెలిపారు. ఆర్టీసీ ద్వారా సురక్షిత ప్రయాణం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు 9959226287, 9182645281, 9490021433లను సంప్రదించాలని కోరారు.

గ్రామాల అభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్, ఫిబ్రవరి 8 : గ్రామాల్లో చేపట్టే అభివృద్ధి పనుల్లో రాజకీయాలకతీతంగా ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. శనివారం మండల కేంద్రంలో సీఆర్ఆర్, సీడీఎఫ్, ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.35 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాల పనులను స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌పర్సన్ గీత, వైస్ చైర్మన్ భాస్కర్ రెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, ఎంపీడీవో సుజాత, నాయకులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేసుకుందాం

ఆమనగల్లు : పట్టణంలో షాద్‌నగర్, మాడ్గుల రహదారుల విస్తరణకు ప్రజలు సహకరించాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కోరారు. ఆమనగల్లు పురపాలక సంఘం కార్యాలయంలో శనివారం రహదారుల విస్తరణపై అధికారులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్లు, రుణమాఫీ, పింఛన్లు, రేషన్‌కార్డులు, రైతు భరోసా, కార్పొరేషన్ రుణాలు, కల్యాణలక్ష్మి తదితర పథకాలపై సమీక్షించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి ప్రహరీ నిర్మాణం చేపడుతామని తెలిపారు. తదనంతరం ఆమనగల్లులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్, ట్రామా కేర్ సెంటర్‌ను నిర్మాణానికి తహసీల్దార్ కార్యాలయం వెనుకభాగంలో ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లలిత, ఎంపీడీవో కుసుమ మాధురి, మున్సిపల్ కమిషనర్ శంకర్ నాయక్, రోడ్లు భవనాల శాఖ డీఈ రవీందర్, ఏఈ రవితేజ, మున్సిపల్ మాజీ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య ఉన్నారు.

వాసుదేవ్‌పూర్‌లో బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేస్తున్న దశరథ్‌నాయక్

పేదలను ఆదుకోవడమే రాధాకృష్ణ ట్రస్ట్ లక్ష్యం

మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్

కడ్తాల్, ఫిబ్రవరి 8 : మండలంలోని పేదలను ఆదుకోవడమే రాధాకృష్ణ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ లక్ష్యమని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్ అన్నారు. ఇటీవల సాలార్‌పూర్ గ్రామంలో సాయిలు, నార్లకుంట, వంకరాయితండాల్లో కేస్లీ, అఖిల, శంకర్, సోమ్లా, బీచానీ, దేవ్‌సింగ్, భాస్కర్, వాసుదేవ్‌పూర్‌లో శివ, చల్లంపల్లిలో యాదయ్య, పెంటయ్య, సాలమ్మ, గాన్గుమార్లతండాలో రవి, కడ్తాల్‌లో బాలయ్య వివిధ కారణాలతో మరణించారు. బాధిత కుటుంబాలను దశరథ్ నాయక్ పరామర్శించి మనోధైర్యాన్ని కల్పించారు. అనంతరం రాధాకృష్ణ ట్రస్టు తరపున మృతుల కుటుంబాలకు ఐదు వేల చొప్పున రూ.75 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మహారాజ్‌పేట్ పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీవో

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 8 : గ్రామపంచాయతీ, ఎంపీటీసీల ఎన్నికల నేపథ్యంలో శంకర్‌పల్లి మండల పరిధిలోని గోపులారం, పిల్లిగుండ్ల, దొంతాన్‌పల్లి, మహారాజ్‌పేట్ గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను శనివారం శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్లలోని వసతులను పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. ఎంపీడీవో వెంట మండల అధికారులు, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

భవన నిర్మాణ రంగం జిల్లా మహాసభను విజయవంతం చేయాలి

ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి

షాబాద్, ఫిబ్రవరి 8 : భవన నిర్మాణ రంగం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి అన్నారు. శనివారం షాబాద్‌లో భవన నిర్మాణ రంగం జిల్లా మహాసభలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 16న బంజారాహిల్స్ లోటస్ పాండ్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో రంగారెడ్డి జిల్లా భవన నిర్మాణ రంగం మూడవ మహాసభలు జరుగుతాయని, మహాసభలకు భవన నిర్మాణ రంగం కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, బీఓసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్, భవన నిర్మాణ కార్మిక సంఘం షాబాద్ మండల కన్వీనర్ అంజయ్య, సీపీఐ మండల కార్యదర్శి జంగయ్య, ఏఐటీయూసీ మండల కార్యదర్శి నారాయణ పాల్గొన్నారు.


భవన నిర్మాణ రంగం జిల్లా మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఏఐటీయూసీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి తదితరులు

ఒంటరి మహిళ లే టార్గెట్

- చైన్ స్నాచర్స్‌ను పట్టుకున్న పోలీసులు
- వివరాలను వెల్లడించిన సీఐ విజయ్‌కుమార్

వివరాలను వెల్లడిస్తున్న సీఐ విజయ్‌కుమార్

షాద్‌నగర్‌రూరల్, ఫిబ్రవరి 8 : ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసి బంగారు గొలుసులను లాక్కెళ్తున్న ఇద్దరు చైన్ స్నాచర్స్‌ను షాద్‌నగర్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన వివరాలను శనివారం సీఐ విజయ్‌కుమార్ వెల్లడించారు. కర్నూల్ జిల్లాకు చెందిన బెస్త పవన్‌కల్యాణ్, జేస్వ ఇద్దరూ హైదరాబాద్‌లో రాపిడో రైడర్స్‌గా జీవనం కొనసాగిస్తున్నారు. సులభతరంగా డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో ఒంటరి మహిళలను టార్గెట్ చేసుకుని వారి మెడల నుంచి బంగారు గొలుసులను లాక్కెళ్లేవారు.

ఈ నేపథ్యంలో జనవరి 5న మహబూబ్‌నగర్‌కు చెందిన విజయలక్ష్మి తన తల్లిగారి ఊరైన ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామానికి వెళ్లేందుకు షాద్‌నగర్ బస్టాండ్‌లో దిగి ఆటోలో గ్రామానికి వెళ్తుండగా ఒంటరిగా ఉన్న ఆమెను గమనించి అదే ఆటోలో పవన్‌కల్యాణ్ ఎక్కాడు. కొద్దిదూరం పోయాక ఆటో పక్కకు ఆపమని చెప్పి దిగుతూ విజయలక్ష్మి మెడలోంచి 2.5 తులాల బంగారు గొలుసును దొంగిలించి ఆటో వెనకాలనే వస్తున్న జేస్వ బైకుపై ఎక్కి పరారయ్యాడు. విజయలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు శంషాబాద్, షాద్‌నగర్ పోలీసులు ఆధునిక టెక్నాలజీ ద్వారా ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి 2.5 తులాల బంగారు గొలుసు, సెల్‌ఫోన్, రూ. 30వేలు, బైకు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

కొత్తూరు మండలంలోని మల్లాపూర్ తండాలో మాజీ ఉప సర్పంచ్ దశరథ్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న హనుమాన్ ఆలయ గోపుర నిర్మాణానికి మాజీ ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి శనివారం రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు. - కొత్తూరు, ఫిబ్రవరి 8

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో షాద్‌నగర్‌లో ఈ నెల 24, 25 తేదీల్లో నిర్వహించే 26వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో శనివారం మహాసభలకు సంబంధించిన గోడపత్రికలను జిల్లా అధ్యక్షుడు ప్రణయ్, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, చరణ్‌తో కలిసి విడుదల చేశారు. - షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 8

షాద్‌నగర్ మున్సిపాలిటీలోని శ్రీ శివమారుతిగీతా అయ్యప్ప మందిరంలో శ్రీ గిరిజామృత లింగేశ్వరస్వామి(పార్వతీ పరమేశ్వరుల) 52వ కల్యాణోత్సవాన్ని శనివారం కన్నులపండువగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి సుప్రభాతం, అభిషేకం, ఎదుర్కోలు వంటి ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేపట్టారు. అంతకు ముందు స్వామివారి పల్లకి సేవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. - షాద్‌నగర్‌టౌన్, ఫిబ్రవరి 8

చేవెళ్ల మండల పరిధి రామన్నగూడ గ్రామంలో శనివారం పర్మన్న చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, యువ నాయకుడు పెద్దోళ్ల దయాకర్ ఆధ్వర్యంలో బియ్యం, ఇంటి మరమ్మతులకు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. - చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 8

తమ్ముడే హత్యకు సూత్రధారి

- వివాహేతర సంబంధమే కారణం
- కేసును ఛేదించిన మోకిల పోలీసులు

చేవెళ్ల రూరల్, ఫిబ్రవరి 8 : రెండు నెలల కింద జరిగిన వ్యక్తి హత్య కేసును మోకిల పోలీసులు ఛేదించారు. అతడి తమ్ముడే హంతకుడని.. వివాహేతర సంబంధమే ఇందుకు కారణమని తేల్చారు. మోకిల సీఐ వీరబాబు కథనం ప్రకారం.. బీహార్ రాష్ట్రానికి చెందిన దీపక్ కుమార్(23) శంకర్‌పల్లి మండలం మోకిలలో బార్బర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడి తమ్ముడైన సందీప్ కుమార్ అలియాస్ రాజా భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. ఈ విషయం అతడికి తెలువడంతో ఎలాగైనా చంపాలని నిర్ణయించుకున్నాడు. ఇందులో భాగంగా తన స్నేహితులైన గోవింద్ సహానీ, మిరాజ్ ఆలం, ప్రదీప్‌కు విషయం చెప్పాడు. ప్లాన్‌లో భాగంగా మిరాజ్ గత డిసెంబర్ 27న దీపక్‌ను లైంగిక ఆనందం కోసం ఓ మహిళ దగ్గరికి తీసుకెళ్తానని ఏమార్చి శంకర్‌పల్లి మండల పరిధి రామాంతపూర్ శివారులోకి తీసుకెళ్లాడు. ప్లాన్‌లో భాగంగా ముందుగానే అక్కడే ఉన్న ప్రదీప్, మిరాజ్ కలిసి దీపక్‌పై భారీ రాళ్లతో కొట్టి హత్య చేశారు. తరువాత సందీప్ గోవింద్ బైక్‌పై అక్కడకు వెళ్లి చనిపోయాడని నిర్ధారించుకున్న తర్వాత దీపక్ ఫోన్‌లోని సిమ్ కార్డును తీసుకొని ఫోన్‌ను ధ్వంసం చేశారు. తర్వాత వారి ఫోన్లు స్విచ్ఛాఫ్ చేసుకొని మహారాష్ట్రకు పరారయ్యారు. దీపక్ సోదరి తమ సోదరుడు కనిపించడం లేదని మోకిల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో సీసీ ఫుటేజ్‌ను పరిశీలించిన పోలీసులు సందీప్, మిరాజ్‌పై అనుమానం రావడంతో నిఘా పెట్టారు. ఇటీవల మహారాష్ట్ర నుంచి తిరిగి హైదరాబాద్ రావడంతో సందీప్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా నేరం అంగీరించాడు. దీంతో పోలీసులు ఘటనా స్థలానికి తీసుకెళ్లి బైక్, మృతుడి అస్థిపంజర అవశేషాలను స్వాధీనం చేసుకున్నారు. కాగా ప్రదీప్ పరారీలో ఉన్నాడు. నిందితులను కోర్టులో హాజరుపర్చామని సీఐ వీరబాబు తెలిపారు.

ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి విఠాయిపల్లికి చెందిన ప్రభావతికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో రూ.39 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరు కాగా.. ఆ చెక్కును శనివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు బాధితురాలికి అందజేశారు. - ఆమనగల్లు, ఫిబ్రవరి 8

నేడు బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశం

యాచారం, ఫిబ్రవరి 8 : బీఆర్ఎస్ విస్తృత స్థాయి సమావేశాన్ని మండల కేంద్రంలోని సాయి శరణం ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు కర్నాటి రమేశ్‌గౌడ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు క్యామ మల్లేశ్, మంచిరెడ్డి ప్రశాంత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు. సమావేశానికి మండలంలోని అన్ని గ్రామాల నుంచి మాజీ ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

10న వేలం పాట

చేవెళ్లటౌన్, ఫిబ్రవరి 8 : చేవెళ్ల ప్రొహిబిషన్ ఎక్సైజ్ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన ఐదు ద్విచక్రవాహనాలు, ఒక ట్రాలీ ఆటోను ఈ నెల 10న చేవెళ్ల ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు వేలం వేయడం జరుగుతుందని చేవెళ్ల ఎక్సైజ్ సీఐ శ్రీలత, ఎస్సై మైనొద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేత

కొందుర్గు, ఫిబ్రవరి 8 : వీర్నపేట ప్రీమియర్ లీగ్ సీజన్-2లో విజేతగా నిలిచిన జట్టుకు బీఆర్ఎస్ నాయకుడు బోడంపాటి రవీందర్‌రెడ్డి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో పట్టుదల, అంకితభావంతో రాణిస్తే విజయం ఖాయమన్నారు. గ్రామీణ స్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు తమవంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడా మైదానాలు నిర్మించడం జరిగిందని, మైదానాలను సద్వినియోగం చేసుకొని క్రీడల్లో రాటుదేలాలన్నారు. అనంతరం విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు సలీం, రాములు, రమేశ్, గణేశ్, యాదగిరి, మొగులయ్య, మురళి, హాజీ, రాజు, యాదగిరి, క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే అంతర్జాతీయ ఖ్యాతి

- పాపిరెడ్డిగూడ పీఈటీ ఆనంద్‌బాబు
- తాలూకా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

క్రీడాకారులకు బహుమతులు అందజేస్తున్న స్థానిక నేతలు

కేశంపేట, ఫిబ్రవరి 8 : పట్టుదల, అంకితభావంతో క్రీడల్లో రాణిస్తే అంతర్జాతీయ ఖ్యాతి లభిస్తుందని కేశంపేట మండలంలోని పాపిరెడ్డిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఈటీ ఆనంద్‌బాబు అన్నారు. మండలంలోని పాపిరెడ్డిగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన అథ్లెటిక్ పోటీల్లో విజేతలకు పీఈటీ ఆనంద్‌బాబు ఆధ్వర్యంలో శనివారం బహుమతులతోపాటు షీల్డులు అందజేశారు. ఈ సందర్భంగా పీఈటీ మాట్లాడుతూ.. 1కె, 2కె, 3కె, 5కె విభాగాల్లో సాగిన క్రీడల్లో నియోజకవర్గవ్యాప్తంగా 16 పాఠశాలలకు చెందిన 159 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోగా 130 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచిన వారికి నగదుతోపాటు షీల్డు, సర్టిఫికెట్లు, 4వ స్థానం నుంచి 10వ స్థానంలో నిలిచిన క్రీడాకారులకు సర్టిఫికెట్లు అందజేశామన్నారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు ఆట పాటల్లో రాణించాలని పీఈటీ కోరారు. కార్యక్రమంలో కేశంపేట పీహెచ్‌సీ వైద్యాధికారిణి నిఖిత, ఇన్‌చార్జి హెచ్ఎం గోపాల్ రెడ్డి, ఆయా పాఠశాలల పీఈటీలు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

60 గొర్రెలు మృతి

మాడ్గుల, ఫిబ్రవరి 8 : మండల పరిధిలో ఇర్విన్ గ్రామ శివారులో నల్లచెరువు ప్రాంతంలో 60 పాలమూరు గొర్రెలు మృతి చెందాయి. బాధితుడు వనపర్తి జిల్లా, గోపాల్‌పేట మండలానికి చెందిన వందేల శ్రీరాములు గొర్రెల యజమాని. ప్రతి సంవత్సరం గొర్రెలను ఇక్కడకు తెచ్చి మూడు నెలలపాటు ఇక్కడే ఉండి గొర్రెలను కాసేవాడు. శనివారం నల్లచెరువు నుంచి అజిలాపూర్ వెళ్లే రోడ్డుకు ఇరువైపులా గోపుగుంతలున్నాయి. 60 గొర్రెలు రోడ్డును ఒకేసారి దాటుతుండగా గోపుగుంతలో పడి ఒకదానిపై మరొకటి పడి మృతి చెందినట్లు బాధితుడు తెలిపాడు. తనకు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని వాపోయాడు. ప్రభుత్వం ఆదుకొని ఆర్థిక సహాయం చేయాలని కోరాడు.

ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠకు ఎమ్మెల్సీ కవితకు ఆహ్వానం

హయత్‌నగర్, ఫిబ్రవరి 8: హయత్‌నగర్ మండల కార్యాలయ ఆవరణలో రేణుకా ఎల్లమ్మ దేవాలయం ప్రారంభోత్సవ కార్యక్రమానికి రావాలని తెలంగాణ జాగృతి నాయకుడు ఆవుల సురేందర్, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను శనివారం కలిసి ఆహ్వాన పత్రికను అందజేసినట్లు తెలిపారు. ఈ నెల 14 నుంచి 16 వరకు హయత్‌నగర్ రేణుకా ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ జాగృతి రాష్ట్ర నాయకులు సందీప్ కుమార్, రాము యాదవ్, ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్, గౌరవ అధ్యక్షుడు స్వామి, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్, కోశాధికారి జంగం, ఉపకోశాధికారి సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ కవితకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు, జాగృతి నాయకులు

నార్సింగి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి

నాణ్యమైన విద్య, భోజనం అందించాలి

గురుకుల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

మణికొండ, ఫిబ్రవరి 8 : విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు పౌష్టికాహారంతో కూడిన భోజనాన్ని అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని రంగారెడ్డి కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. జిల్లా పరిధిలోని నార్సింగి సాంఘిక సంక్షేమ బాలిక గురుకుల పాఠశాలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ముచ్చటిస్తూ భోజనాన్ని పరిశీలించారు. ఆహార పదార్థాలు కలుషితం కాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

డైనింగ్ హాల్, క్లాస్ రూం, పరిసరాలు, స్టోర్ రూంలలో నిలువ ఉంచిన ఆహార పదార్థాలు, కూరగాయలు, ఇతర సరుకులను కలెక్టర్ పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా అని ఆరా తీశారు. విద్యార్థులకు ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున సిలబస్ పూర్తి చేసి పునఃశ్చరణ తరగతులు ప్రారంభించాలన్నారు. ఆయా సబ్జెక్టుల్లో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, వారికి ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. పదో తరగతిలో నూటికి నూరుశాతం విద్యార్థులందరూ అత్యుత్తమ గ్రేడ్లతో ఉత్తీర్ణత సాధించేలా నాణ్యమైన బోధన అందించాలని కలెక్టర్ ఉపాధ్యాయులను కోరారు. కార్యక్రమంలో నార్సింగి మున్సిపల్ కమిషనర్ కృష్ణ మోహన్‌రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.